# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-05-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశ భద్రతలో పౌరుల్ని సమాయత్తం చేసేందుకు రేపు మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్ర హోంశాఖ రాష్ట్రాలను ఆదేశించింది.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఈరోజు సాయంత్రంలోగా పరిహారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రహదారి రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు.**

4. **రబీలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.**

5. **చందనోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా సింహాచలం ఆలయంలో గోడ కూలి, ఏడుగురు భక్తులు మృతి చెందిన ఘటనలో ఆరుగురు ఇంజనీర్లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది.**

==========================

పహల్గాం ఉగ్రదాడితో భారత్– పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతున్న వేళ భద్రతా సన్నద్ధతపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశ భద్రతలో పౌరుల్ని సమాయత్తం చేసేందుకు రేపు మాక్ డ్రిల్స్ నిర్వహించాలని రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ సూచించింది. భద్రతా సన్నద్ధతపై పౌరులకు అవగాహన కల్పించాలని, అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో తెలపాలని పేర్కొంది. శత్రు దాడి జరిగినప్పుడు విద్యార్థులు, పౌరులు తమను తాము రక్షించుకొనేందుకు వీలుగా స్వీయ రక్షణపై అవగాహన కల్పించాలని ఆదేశించింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్లతో పంట నష్టపోయిన రైతులకు ఈరోజు సాయంత్రంలోగా పరిహారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గత రెండురోజులుగా కురిసిన అకాలవర్షాలపై సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, విపత్తుల నిర్వహణ అధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి, నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. పిడుగుపాటు కారణంగా చనిపోయిన 10 మంది బాధితుల కుటుంబాలకు కూడా తక్షణమే పరిహారం అందించాలని

సూచించారు. ఈ వివరాలను సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి వివరిస్తూ..

.....వాయిస్.... 35 సెకన్లు....

---

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర రహదారి రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు. హైదరాబాద్‌లో రెండు పైవంతెనలను ఆయన నిన్న ప్రారంభించారు. హైదరాబాద్‌లో 2 వేల 169 కోట్లు, కుమురం భీం జిల్లాలో 3 వేల 900 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కుమురం భీం జిల్లా రెబ్బెన మండలంలో కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు వద్ద, అంబర్‌పేట పురపాలక మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో గడ్కరీ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి లక్షా 25 వేల కోట్ల రూపాయలు వెచ్చించామని తెలిపారు. రాబోయే మూడేళ్లలో 2 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్ర ముఖచిత్రాన్నే మారుస్తామని నితిన్ గడ్కరీ వివరిస్తూ...

.....వాయిస్.... 35 సెకన్లు....

---

రబీలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. గతంలో 16, 17గా ఉన్న తేమ శాతాన్ని 22 శాతం వరకు అనుమతించాలని మిల్లర్లను ఆదేశించామని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయమై పౌరసరఫరాల శాఖ రాష్ట్ర అధికారులు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధికారులు, మిల్లర్లు, రైతులతో ఆయన నిన్న కాకినాడ కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకూ సుమారు 49 లక్షల 40 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. దాదాపు 11 వేల 400 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో 24 గంటల్లోపే జమ చేశామని మనోహర్ వివరిస్తూ...

.....వాయిస్.... 32 సెకన్లు....

---

చందనోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా సింహాచలం ఆలయంలో గోడ కూలి, ఏడుగురు భక్తులు మృతి చెందిన ఘటనలో ఆరుగురు ఇంజనీర్లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వీరిలో ఇద్దరిపై క్రిమినల్ చర్యలకు ఆదేశించింది. గోడ నిర్మించాలని ఆదేశించిన ఆలయ కార్యనిర్వహణాధికారిని కూడా సస్పెండ్ చేసింది. కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలకు ఆదేశించడంతోపాటు, బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. గత నెల 30వ తేదీన జరిగిన ఈ ఘటనపై నియమించిన త్రిసభ్య కమిటీ విచారణ జరిపి, ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి నిన్న అందజేసింది. గోడ నిర్మాణంలో లోపాలు, దీనికి బాధ్యులను పేర్కొంటూ చర్యలకు సిఫారసు చేసింది. గోడ నిర్మాణానికి ఎటువంటి ప్లాన్, డిజైన్ లేకపోవడం మొదలుకొని నాణ్యత పాటించకపోవడం, ఇంజనీర్లు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ప్రమాదానికి దారితీశాయని కమిటీ స్పష్టం చేసింది.

---

రైతులే నిజమైన శాస్త్రవేత్తలని, వారి అనుభవాలతోపాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించాలని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వికారాబాద్ జిల్లా ధారూర్‌లో నిన్న నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో

ఆయన పాల్గొని మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు బీమా వర్తింపచేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తే నష్టాలుండవని పేర్కొన్నారు.

---------------------------

డీఎస్సీ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాల, ఇంటర్మీడియట్, ఉన్నత విద్య శాఖలపై గుంటూరు జిల్లా ఉండవల్లిలోని నివాసంలో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డీఎస్సీ పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పదవ తరగతి ఫలితాలపైనా మంత్రి సమీక్షించారు. వచ్చే ఏడాది నుంచి అకడమిక్ అంశాలపైనే దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించాలని, ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించేందుకు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

---------------------------

పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తయిన విద్యార్థులు బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం కోసం ఏపీ ఈసెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈ సెట్ చైర్మన్, జేఎన్టీయూ అనంతపురం ఉప కులపతి సుదర్శనరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 110 కేంద్రాల్లో ఈ రోజు పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉన్నత విద్యామండలి ఆదేశాల ప్రకారం విద్యార్థులు నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతింబోమని స్పష్టంచేశారు. ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం 2 గంటలకు రెండు సెషన్లలో పరీక్ష ఉంటుందని.. కనీసం ఒక గంట ముందు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందని కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ రాజీవ్ జైన్ తెలిపారు. విజయవాడలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలోనే అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ పథకాల కింద సుమారు 38 కిలోమీటర్ల మేర కొత్త రైలు నెట్‌వర్క్‌తోపాటు విజయవాడ, విశాఖపట్టణాల్లో ప్రతిపాదిత మెట్రో రైలు ప్రాజెక్టుల అమలుకు చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. పీఎం ఈ-బస్ సేవ పథకం కింద సుమారు 750 ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించామని రాజీవ్ జైన్ వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు, రేపు భిన్న వాతావరణ పరిస్థితులు ఉంటాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కొన్ని చోట్ల 41 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

---------------------------

తెలంగాణలోని పలు జిల్లాల్లో నిన్న భూమి స్వల్పంగా కంపించింది. కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో భూ ప్రకంపనలు సంభవించాయి. కరీంనగర్ జిల్లాలోని గంగాధర, చొప్పదండి, రామడుగు, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ తదితర మండలాల్లో భూమి 2 సెకెన్లపాటు కంపించింది. మరోవైపు నిర్మల్ జిల్లాలోనూ భూ ప్రకంపనలు సంభవించాయి. కడెం, జన్నారం, ఖానాపూర్, లక్ష్మణ్‌చాందా మండలాల్లో 2 నుంచి 5 సెకెన్లపాటు భూమి కంపించింది. భూకంప లేఖినిపై దీని తీవ్రత 3.8గా నమోదైంది.

======================